క్లుప్తంగా

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం ఫాల్గుణ మాసం రోహిణి నక్షత్రం అష్టమి తిథి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు గురువారం తెలిపారు. ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

సీసీ రోడ్లు తనిఖీ



ముక్తేశ్వరంలో సీసీ రోడ్లు తనిఖీ చేస్తున్న క్వాలిటీ కంట్రోల్ బృందం

బల్లికురవ: గ్రామాల్లోని సిమెంటు రోడ్లు, లింకు రోడ్లలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తే ఎక్కువకాలం మన్నికతో ప్రజలకు ఉపయోగపడతాయని క్వాలిటీ కంట్రోల్ డిప్యూటీ ఈఈ ఎంవీ శ్యామ్ ప్రసాద్ విజలెన్స్ ఏఈ సీహెచ్ శ్రీనివాస్ అన్నారు. గురువారం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఇటీవల రూ. 90 లక్షలతో ముక్తేశ్వరం ఎస్‌ఎల్ గుడిపాడు, కూకట్లపల్లి, గొర్రెపాడు, కొత్తూరు, వెలమవారిపాలెం గ్రామాల్లో నిర్మించిన సీసీ రోడ్లు.. డ్రైన్లను క్వాలిటీ కంట్రోల్ బృందం తనిఖీ చేశాయి. ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో ప్రమాణాలు పాటించకపోతే పగుళ్లు ఇస్తాయన్నారు. ఏఈ మాధవరెడ్డి పాల్గొన్నారు.

క్షయ నివారణ సాధ్యం



ఆరోగ్యకేంద్రం వద్ద డాక్టర్ల బృందం

వేటపాలెం: క్షయవ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని నేషనల్ పాపులేషన్ రిసెర్చ్ సెంటర్ డాక్టర్ రమణ వైద్య సిబ్బందికి సూచించారు. గురువారం జాతీయ క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా నేషనల్ పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ డాక్టర్స్ స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. సచివాలయాన్ని సందర్శించారు. 13 మంది వ్యాధిగ్రస్తుల రికార్డులను పరిశీలించారు. జిల్లా టీబీ, లెప్రసీ, ఎయిడ్స్ నోడల్ అధికారి షేక్ మహమ్మద్ సాదిక్, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రామ్ ఆఫీసర్ సౌజన్య, డీపీఎంఎం ప్రేమపావని, వైద్యాధికారి సాయివైష్ణవి, సీహెచ్‌ఓ గురవమ్మ, సూధాకర్, మార్తమ్మ పాల్గొన్నారు.

పార్కింగ్ స్థలాల పరిశీలన



పార్కింగ్ స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

అద్దంకి: ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్లను పురస్కరించుకుని ఏర్పాటు చేయబోయే పార్కింగ్ స్థలాలను గురువారం చీరాల డీఎస్పీ మొయిన్ పరిశీలించారు. పోలీసులకు తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ట్రాఫిక్ డైవర్షన్‌తో తీసుకోబోయే చర్యల గురించి సీఐ సుబ్బరాజు వివరించారు.

అంకితభావంతో విధులు నిర్వహించాలి

చీరాల టౌన్: గ్రామ సచివాలయాల ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వహించాలని ఎంపీడీఓ శివసుబ్రమణ్యం సూచించారు. గురువారం దేవాంగపురి, సాల్మన్‌సెంటర్ గ్రామ పంచాయితీల్లోని సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయాల వారీగా పెండింగ్‌లో ఉన్న సమస్యల అర్జీలు, మొబైల్ యాప్ డేటా, సచివాలయ ఉద్యోగుల పనితీరు, రికార్డులను పరిశీలించారు. సచివాలయానికి కేటాయించిన ఉద్యోగుల హాజరు, శాఖల వారీ ఉద్యోగుల పనితీరును పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ విధుల్లో అలసత్వం వహించిన చర్యలు తప్పవన్నారు. అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠ మహోత్సవం

ఒంగోలు మెట్రో: యజ్ఞగిరి నరసింహస్వామి పీఠం ఆధ్వర్యంలో స్థానిక త్రోవగుంటలో శ్రీగౌరీ ఉమామహేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠను ఆలయ ప్రధాన అర్చకుడు పవన్‌శర్మ, అర్చకులు సతీష్‌శర్మ గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా గణపతి పూజ, పుణ్యాహవాచనం, కలశ స్థాపన, కంకణధారణ, గణపతి హోమం, మహా సుదర్శన హోమం నిర్వహించారు. సాయంత్రం ఏడు గంటలకు సామూహికంగా పాల్గొన్న మహిళా భక్తులచే కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సూరేపల్లిలో వరి కోత కోస్తున్న కూలీలు



ధాన్య రాశి

సర్కారే పగబడితే!

- అలంకార ప్రాయంగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు
- వరి సాగుకు పెరుగుతున్న పెట్టుబడులు
- ఏడాదికేడాదికి తగ్గుతున్న సాగు విస్తీర్ణం
- బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లో 16 వేల ఎకరాల్లో సాగు

బల్లికురవ: ఆహార ధాన్యమైన వరి పంటకు ఏడాదికేడాదికి పెట్టుబడులు పెరగటంతో సాగు విస్తీర్ణం క్రమంగా తగ్గుతోంది. ఫలితంగా పశు గ్రాసానికి గిరాకీ పెరుగుతోంది. సాగర్ అద్దంకి బ్రాంచ్ కాల్వ పరిధిలో బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లో 22 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఖరీఫ్, రబీలో సాగర్ ఆయకట్టు బోర్ల కింద బీపీటీ, సీఆర్ 1009 సావిత్రి (బుడ్డలు) రకాలను సుమారు 16 వేల ఎకరాల్లో సాగు చేశారు. ఖరీఫ్‌లో 160 నుంచి 170 రోజులకు రబీలో 150 నంచి 160 రోజులకు దిగుబడులు దక్కుతున్నాయి. సొంత భూమి ఉంటే ఎకరా పంట సాగుకు దుక్కి దున్నకం, దమ్ము, వరినాటు 3 సార్లు బలం మందులు, కలుపు తీతలు, చీడపీడల నివారణకు పురుగు మందుల పిచికారీ, కోత, పంట నూర్పిడికి రూ. 50 వేల నుంచి రూ. 60 వేల వరకు పెట్టుబడులు అవుతున్నాయి. అయితే దిగుబడులు చూస్తే 30 బస్తాలకు మించటంలేదు. ప్రస్తుతం 75 కేజీల బీపీటీ బస్తా రూ. 1600కు.. బుడ్డలు రూ. 1400 కొనుగోలు చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో పెట్టుబడులు దక్కటమే రైతులకు గగనంగా మారింది. కౌలు రైతులు ఎకరాకు 12 నుంచి 15 బస్తాల కౌలు చెల్లించాలి. దీంతో నష్టాలతో వరి పొలాలను కౌలుకు తీసుకోనేందుకు ఎవరూ ముందుకు రావటంలేదు.

పెట్టుబడి సాయంలోనూ జాప్యం

కూటమి ప్రభుత్వం రైతుకు పెట్టుబడి సాయంగా ఒక్కో రైతుకు రూ. 20 వేలు చెల్లిస్తామని ఎన్నికల హామీ ఇచ్చింది. అధికారాన్ని చేపట్టి తొమ్మిది నెలలవుతున్నా అతీగతీ లేకుండా పోయింది. ధాన్యం కొనుగోలు కేంద్రాలు అలంకార ప్రాయంగా మారాయి. ఈ రెండు మండలాలు చవిటి భూములు కావటంతో బుడ్డలు కొనుగోలుకు అనుమతి లేదని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు చెబుతున్నారు. బీపీటీలకు కూడా పేర్లు పెడుతున్నారు. తేమ శాతం అధికంగా ఉందంటూ వంకలు చూపుతున్నారు.

ప్రయివేటు దగా

ప్రభుత్వం చేతగానితనాన్ని అలుసుగా తీసుకుంటున్న ధాన్యం వ్యాపారులు సిండికేట్‌గా మారి బస్తా (75 కేజీలు) రూ. 1400 కొనుగోలు చేస్తున్నారు. రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకుని రిమోట్ సిస్టంతో బస్తాకు 5 నుంచి 7 కేజీలు అదనంగా కాటా వేస్తున్నారు. ఈ విషయాన్ని ఇటీవల ముక్తేశ్వరం గ్రామ రైతులు గుర్తించి వ్యాపారుల్ని నిలతీశారు. చేసేది లేక కాజేసిన 5 కేజీలు కూడా కలిపి లెక్క కట్టి ఇచ్చారు.



పల్నాడు జిల్లాకు గడ్డి ఎగుమతి

గ్రాసానికి మాత్రం డిమాండ్

పశుగ్రాసానికి గిరాకీ పెరుగుతోంది. రైతులు పెట్టుబడులు తగ్గించుకునేందుకు మిషన్ ద్వారా కోతలు చేపట్టడం.. పంట సాగు విస్తీర్ణం తగ్గటంతో పశుగ్రాసానికి గిరాకీ పెరిగింది. గత రెండేళ్లుగా ఎకరా గడ్డి రూ. 10 వేల నుంచి రూ.12 వేలకు పలకగా.. ఈ ఏడాది రూ. 14 వేల నుంచి రూ. 15 వేలు పలుకుతోంది. ఈ రెండు మండలాల నుంచి నిత్యం ట్రాక్టర్లు, లారీల ద్వారా పల్నాడు, ఒంగోలు, గుంటూరు జిల్లాలకు ఎగుమతులు జరుగుతున్నాయి.

బుడ్డలు కొనుగోలు చేయాలి



చౌడు భూములు కావటం వల్ల సీఆర్ 1009 బుడ్డలను 10 ఎకరాల్లో సాగు చేశా. మా గ్రామంలో కొనుగోలు చెయ్యటంలేదు. ప్రయివేట్ వ్యాపారులు సిండికేట్‌తో ధరను దిగజార్చారు. ప్రభుత్వమే కొనుగోలు చేసి మద్దత్తు ధరను ఇవ్వాలి.
– అదపాల పెద్దారావు, ముక్తేశ్వరం

అన్నదాత సుఖీభవ అందించాలి



పది ఎకరాల్లో వరి సాగు చేశా. పెట్టుబడులు ఇబ్బడి ముబ్బడిగా పెరిగి ఆరులక్షల వరకు అయ్యాయి. దిగుబడులు ఆశించిన స్థాయిలో దక్కలేదు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చెయ్యాలి.
– చంటి రాజశేఖరరెడ్డి, రైతు, సూరేపల్లి

నిండుకుండలా సాగర్ జలాలు



వల్లాపల్లి లాకుల వద్ద నీటి ప్రవాహం

బల్లికురవ: మంచినీటి అవసరాల నిమిత్తం సాగర్ జలాలు అద్దంకి బ్రాంచ్‌కాల్వకు పూర్తి స్థాయిలో విడుదల చేశారని తహసీల్దార్ రవినాయక్ వెల్లడించారు. 18/0 సంతమాగులూరు మండలంలో అడవిపాలెం జిల్లా సరిహద్దు వద్ద 1200 క్యూసెక్కులు 33/2 వల్లాపల్లి లాకుల వద్దకు 830 క్యూసెక్కులు నీరు ప్రవహిస్తున్నట్లు చెప్పారు. నీటిఫైడ్ చెరువులన్నింటినీ నింపుకుని, వేసవి తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని సూచించారు. నీరు దుర్వినియోగం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆదర్శ రైతుకి సన్మానం



ఆదర్శ రైతు శ్రీనివాసరెడ్డిని సన్మానిస్తున్న అధికారులు

ఇంకొల్లు(చినగంజాం): ప్రకృతి వ్యవసాయ కార్యచరణలో భాగంగా వంకాయలపాడు గ్రామానికి చెందిన రైతు కాసు శ్రీనివాసరెడ్డిని ఏడీఏ ఎన్. మోహనరావు ఘనంగా సన్మానించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంబించినందుకు గాను గురువారం బాపట్లలోని కలెక్టర్ కార్యాలయంలో సన్మానించారు. డీఏఓ వై. రామకృష్ణ, డీపీఎం వాణిశ్రీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

100 శాతం పన్ను వసూలు చేయాలి

చీరాల టౌన్: గ్రామాల్లో పెండింగ్ బకాయిలు, ఇంటి పన్నుల వసూళ్లను మార్చి నెలాఖరు లోపు 100 శాతం వసూళ్లు చేయాలని ఈవోఆర్డీ రామకృష్ణ పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని గ్రామ పంచాయతీల కార్యదర్శులతో ఈవోఆర్డీ సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. గ్రామాల వారీగా ఇంటి పన్నుల బకాయిలు పేరుకుపోవడంతో అభివృద్ధికి అడ్డంకిగా మారిందన్నారు. అన్ని గ్రామ పంచాయతీలు గ్రామాల్లోని బిల్లు కలెక్టర్లు, పంచాయితీ సిబ్బంది మార్చి నెలాఖరులోపు పన్నుల వసూళ్లు పూర్తి చేయాలన్నారు. మండలంలోని గ్రామాల్లోని ప్రజలు రోగాల బారిన పడకుండా ఉండాలంటే గ్రామాలన్నీ సుందరంగా ఉండాలని, పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా చేసి గ్రామాలను రోగాల నుంచి కాపాడాలన్నారు. పారిశుద్ధ్య నిర్మూలనకు చర్యలు తీసుకుని గ్రామాల్లో చెత్తకుప్పలు లేకుండా చూడాలన్నారు. ప్రతి పంచాయతీ విధిగా ఫాగింగ్ యంత్రం వినియోగించి దోమల నిర్మూలన చర్యలు చేపట్టారు.

బాలికలను బాగా చదివించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కార్యదర్శి రాణి

పర్చూరు(చినగంజాం): ఆడపిల్లల పట్ల వివక్షత చూపకుండా వారిని బాగా చదివించి తీర్చిదిద్దాలని నూతలపాడు పంచాయతీ కార్యదర్శి కె. రాణి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా 6 వ రోజు గురువారం మహిళలను సత్కరించే కార్యక్రమాన్ని నిర్వహించారు. నూతలపాడు పంచాయతీ, అంగన్‌వాడీ కేంద్రం, సచివాలయ మహిళా ఉద్యోగులను సత్కరించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం ఎస్. జయసువార్త, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం. అన్నపూర్ణ, మహిళా పోలీసులు సరిత, అంజలి, అంగన్ వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

రైతు రుణాలు రద్దు చేయాలి



తహసీల్దార్ వెంకటరత్నంకు వినతి పత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

ఇంకొల్లు(చినగంజాం): అప్పుపాలైన రైతుల రుణాలు రద్దు చేయాలని ఇంకొల్లు మండల రైతు సంఘం కమిటీ డిమాండ్ చేసింది. ఇంకొల్లు తహసీల్దార్ ఎస్. వెంకటరత్నంకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మండల రైతు సంఘం కమిటీ ఆధ్వర్యంలో గురువారం అందజేశారు. జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు కందిమళ్ళ రామకోటేశ్వరరావు మాట్లాడుతూ గత మూడేళ్ళుగా పెట్టి పెట్టుబడులకు సరిపడా ధరలు లేక తెగుళ్ళతో పాటు ప్రకృతి సహకరించక మిరప రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఈ ఏడాది బ్లాక్ బర్లీ పొగాకును కొనుగోలు చేసేందుకు కంపెనీలుగానీ, వ్యాపారులుగానీ ముందుకు రాలేదని దీంతో రైతుల్లో కలవరం మొదలైందన్నారు. అన్నం ఆదియ్య, మాదాల అంజయ్య, కొల్లూరి హనుమంతరావు, బొగ్గవరపు శంకరరావు, బండి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

వీరాస్వామికి నివాళులర్పించిన గాదె



వీరాస్వామి మృతదేహానికి నివాళులర్పిస్తున్న గాదె మధూసూదన రెడ్డి

ఇంకొల్లు(చినగంజాం): మండలంలోని సూదివారిపాలెం ఉప సర్పంచ్ కట్టెబోయిన నాగేశ్వరరావు తండ్రి వీరాస్వామి మృతి చెందడంతో ఆయనకు పర్చూరు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గాదె మధూసూదనరెడ్డి నివాళులర్పించారు. గురువారం సూదివారిపాలెంలోని ఆయన ఇంటికి వెళ్ళి మృతదేహానికి నివాళులర్పించిన అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇంకొల్లు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ చిన్ని పూర్ణారావు, మాజీ కన్వీనర్ బండారు ప్రభాకరరావు, నూతలపాటి బలరాం, హరిప్రసాద్, ఎలియాజర్, షంషుద్దీన్, గొర్రుముచ్చు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు



వల్లాపల్లి ఎయిడెడ్ స్కూల్‌ను తనిఖీ చేస్తున్న డిప్యూటీ ఈవో

బల్లికురవ: ఈ నెల 17 నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు పూర్తిస్థాయిలో పక్కా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చీరాల డిప్యూటీ ఈవో జి. గంగాధర్ తెలిపారు. గురువారం బల్లికురవ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఫర్నిచర్, తాగునీరు, ఫ్యాన్లు, టాయిలెట్ల వసతి కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం కేటాయించిన 9552300009 ఫోన్ నంబర్‌కు వాట్సాప్ ద్వారా హాయ్ అని మేసేజ్ పెడితే హాల్‌టికెట్ పొందవచ్చన్నారు. ఎంఈవో 2 కె. రమేష్ బాబు, బల్లికురవ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కె. హనుమంతరావు, వల్లాపల్లి ఎయిడెడ్ స్కూల్ హెచ్‌ఎం బి. రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన చట్టాన్ని రద్దు చేయండి



మాట్లాడుతున్న సీహెచ్ మజుందార్

అద్దంకి: మోటార్ వాహనాల సవరణ చట్టం రవాణా రంగంపై భారాలు మోపుతోందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ మజుందార్ ఆవేదన వ్యక్తం చేశారు. మోటారు వాహనాల సవరణ చట్టం అనే అంశంపై పట్టణంలోని ఫ్రెండ్స్ ఆటోవర్కర్స యూనియన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ భవన్‌లో సదస్సు నిర్వహించారు. ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎస్‌కే బాషా అధ్యక్షుడిగా వ్యవహరించారు. మంజుందార్ మాట్లాడుతూ దేశ జాతీయ సంపద జీడీపీలో ట్రాన్స్‌పోర్ట్ రంగం నుంచి 10 శాతం ఆదాయం సమకూరుతోందన్నారు. దీనిలో రవాణా రంగంలో పనిచేస్తున్న కార్మికులు శ్రమ ఉందని ఇది ప్రభుత్వం, ప్రజలు గుర్తించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ మధ్యకాలంలో మోటార్ వాహన రవాణా రంగంలో చట్ట సవరణ చేయటం వల్ల ఆటో రంగంపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులు విపరీతమైన అపరాధ రుసుము ద్వారా వీరి నుంచి రూ. 500 ఉన్న అపరాధ రుసుము రూ.5000 వరకు పెంచటం జరిగిందన్నారు. తీవ్రమైన శిక్షలు పడేలా ఈ చట్టాన్ని సవరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 1వ తేదీ నుంచి ఈ చట్టం అమల్లో ఉంటుందని దీని ద్వారా చదువుకున్న యువత ఉద్యోగ అవకాశాలు లేక స్వయం ఉపాధి పొందుతున్న ఆటోరంగం పైన తీవ్రమైన భారం పడుతోందని వెంటనే చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా అద్దంకిలో ప్రత్యేకమైన ఆటో స్టాండ్ లేకపోవడం వలన ప్రధాన రహదారుల పైన ఆటోలు ఉండటం వలన ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని ఈ సమస్య పరిష్కారానికి వెంటనే ఆటో స్టాండ్ ను ఏర్పాటు చేయాలన్నారు. సీఐటీయూ జిల్లా నాయకులు పి. తిరుపతి రెడ్డి, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు. పట్టణంలోని భవాని సెంటర్ నుంచి అంబేడ్కర్ భవనం వరకు పెద్ద ఆటో ర్యాలీ నిర్వహించారు. ఫ్రెండ్స్ ఆటో వర్కర్స్ యూనియన్ అద్దంకి కార్యదర్శి క్రాంతి కుమార్ గణేష రవి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం



మార్టూరు:బాల్యవివాహాలు చేయబోమని ప్రతిజ్ఞ చేస్తున్న తల్లులు

మార్టూరు: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న మహిళా దినోత్సవంలో భాగంగా గురువారం మండలంలోని పలు గ్రామాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. మార్టూరు అంబేద్కర్ కాలనీ, ఇసుక దర్శి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో, చిమ్మిరి బండ యూపీ పాఠశాలలో, కోనకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయా గ్రామాలకు చెందిన అంగన్ వాడీ టీచర్లు వేడుకలు ఘనంగా నిర్వహించారు. బాలికలు వారి తల్లులతో సమావేశం ఏర్పాటు చేసి బాల్య వివాహాల వలన కలిగే అనర్థాల గురించి, పౌష్టికాహార ఆవశ్యకత గురించి అవగాహన కల్పించారు. బాలికల తల్లులచే బాల్య వివాహాలు తమ పిల్లలకు చేయబోమని ప్రతిజ్ఞ చేయించారు. స్థానిక పాఠశాలలలో బాలికలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతి ప్రదానం చేశారు.

పి–4పై అవగాహన అవసరం



కారంచేడులో పి- 4 సర్వేపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ నేతాజీ

కారంచేడు: పబ్లిక్-ప్రైవేట్-పీపుల్-పార్టనర్ షిప్స్ (పీ4) విధానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాల్సి ఉందని ఎంపీడీఓ కె. నేతాజీ అన్నారు. గురువారం ఆయన స్థానిక మండల పరిషత్ సమావేశపు హాలులో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. గ్రామాల్లో ఈ నెల 8వ తేదీన ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం లాంఛనంగా ప్రారంభిస్తుందన్నారు. ఆ రోజు నుంచి గ్రామాల్లో సిబ్బంది సర్వేను ప్రారంభించాల్సి ఉందన్నారు. 18వ తేదీ వరకు 10 రోజుల పాటు జరిగే ఈ సర్వేలో ప్రభుత్వం ఇచ్చే 27 రకాల ప్రశ్నలతో కూడిన సర్వే చేయాలని వివరించారు. జనాభాలో 10 శాతం సంపన్నులు, అట్టడుగున ఉన్న 20 శాతం మంది ప్రజలకు ఆర్థికపరమైన సపోర్టు అందించేలా ఈ పథకం పనిచేస్తుందన్నారు. బాపట్ల ఎస్ఓ యు. వాణి, కారంచేడు ఏఎస్ఓ పి. సురేష్‌కుమార్, అన్ని గ్రామాలకు చెందిన కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భానుడు భగభగ

- 37 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు
- శీతలపానీయాలకు పెరిగిన గిరాకీ
- రోడ్ల వెంట వెలుస్తున్న దుకాణాలు

వేటపాలెం: సూర్య భగవానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. గీష్మతాపం బెంబేలెత్తిస్తోంది. గురువారం ఒక్క రోజులోనే 37 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. బయటకు అడుగేయాలంటే ఆలో చించాల్సిన పరిస్థితి వచ్చేసింది. ఉదయం 9 గంటలకే భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. సూర్యుడి ఎండ తీవ్రతకు నాలుక తడారుకు పోతున్నాయని ప్రజలు వాపోతున్నారు. మండే ఎండల నుంచి ఉపశమనం కోసం జనం కూల్ డ్రింకులు, మజ్జిగ, పండ్ల రసాలు తాగడానికి ఇష్ట పడుతున్నారు. వేటపాలెం ప్రధాన సెంటర్స్ కూడళ్లలో, ప్రధాన రహదారుల వెంట పుచ్చకాయలు, కొబ్బరికాయలు, చెరకు రసాలు, తాటి ముంజలు, మజ్జిగ వంటి వాటి అమ్మకాలు ఆశాజనంగా సాగుతున్నాయి. ప్రధాన రహదారుల వెంట విక్రయాలు జోరుగా జరుగుతున్నాయి. యువకులు ఈ వ్యాపారాల పట్ల మొగ్గుచూపుతూ ప్రధాన రోడ్లు వెంట దుకాణాలు ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు నిర్వహిస్తున్నారు.



ఒన్‌వే రోడ్డులో చెరకు రసం విక్రయాలు



ప్రధాన రహదారి పక్కన పుచ్చకాయల వ్యాపారం